# పాడుదేవాలయం

ఆ ముసలితాత రోజూ ఊళ్లోకి ముష్టికి వచ్చేవాడు. ఎక్కణ్ణుంచి వస్తున్నాడో ఎవళ్ళకి తెలియలే  పాటపాడడు. "బిచ్చంవేయమ్మా" అనన్నా అనడు. ఏమి మాట్లాడకుండా గుమ్మందగ్గర నిలబడ్తాడు. పొమ్మంటే పోతాడు పొమ్మన్నదాకా నవ్వైనా లేకుండా ఆ గుమ్మందగ్గిరే నుంచుంటాడు. ఊరంతా అడుక్కొని సాయంత్రందాకా మావూళ్లో చెరువు గట్టుమీద కూర్చుంటాడు. ఎప్పుడైనా యిటు అటూ కదుల్తాడేమోగాని సాధారణంగా ఎల్లా కూచుంటాడో అలాగే వుంటాడు. అతని గడ్డం మొక్కజొన్న కండి పీచులా తెల్లగా నెరిసిపోయింది చిరిగిన పేలికలు కట్టుకున్నా అవి శుభ్రంగా వుంటాయి.

అతగాడి కళ్ళు చూస్తే మాత్రం ఆ తాత అంటే అందరికీ ప్రేమ పుట్టుతుంది. వాటిల్లో ఎన్నో ఆపేక్షలు తిరిగిపోతూ వుంటాయి. ఆ తాత వుండగా బాధపడుతూన్న జంతువేదైనా కనబడితే లేచి తన సంచిలోనుంచి గవ్వాకు వేవో పువ్వాకు తీసి కట్లుకట్తాడు. అతను కట్లుకట్టిన జంతువులన్నీ రోగంపోయి ఆరోగ్యంగా వున్నాయన్నమాటే. చెరువుగట్టుమీదా ఆ తాత కూర్చున్నప్పుడే రోగాలతో బాధపడుతున్న పశువుల తోలుకొని అక్కడకు చుట్టుపక్కల వూళ్ళవాళ్ళంతా వచ్చేవారు.

తిండిలేక మాడిపోయే అనేకమంది బీదవాళ్ళకి ఆ తాత కుంచాలకొద్దీ బియ్యం యివ్వడం మేం ఎరుగుదుం.

తన బియ్యం ఎక్కడదాస్తాడో వంటచేసేవాళ్ళు ఎవరైనా వున్నారో ఎవళ్ళకీ తెలవదు.

## 2

ఒకరోజున నేనూ నా స్నేహితుడూ బయలుదేరి మా వూరుకు దక్షిణంగా వున్న అడవిలోకి పోయాం. ఆ అడవిలో ఒక పాడుదేవాలయం ఉందని నాకు తెలుసును. ముళ్ళడొంకలు, పల్లేరు చిట్టడవి దాటి గుడిలో పడ్డాం. అక్కడ అన్నీ ఇటికెలే. ఉట్టిగోడలు మధ్య అసలు గుడితప్ప ఇంకేమీలేవు. నాలుగైదు విగ్రహాలుంటే అవన్నీ మా వూళ్లో కొత్తగా కట్టించిన గుళ్లోకి తీసికెళ్ళారు. కాని ఇంకా అక్కడ ఎన్నో రాళ్ళస్తంభాలు శాసనాలు చెక్కిన రాళ్ళు ఉన్నాయి. విరిగిపోయిన విగ్రహాలు చెక్కడాలు చాలా ఉన్నాయి. అందుకనే పురాతన శిల్ప పరిశోధక సంఘమువారు "ఇక్కడుండే వస్తువులు ఒక్కటీ ముట్టుకోకూడదని" గవర్నమెంటు ఉత్తరువు ఒక బల్ల మీద రాయించి అక్కడ పాతేయించారు. ఆ గుడి చాలా పెద్దది. ఆ చిత్రాలన్నీ చూపిస్తో నాకుతెలిసిన ఆ పాడు దేవాలయగాధ లేవేమిటో మా స్నేహితుడికి చెపుతూంటే సాయంత్రమైంది.

సప్తమినాటి చంద్రుడు బాగా కాంతులు చిమ్మాడు. ఆ వెన్నెల్లో ఆ పాడు దేవాలయం మాకు చాలా అందంగా కనబడింది.

## 3

ఇంతట్లో ఒక గంట వినబడింది. ఇద్దరం హడలిపోయాము. ఆ అడవిలో ఖంగు ఖంగుమని గంటెక్కణ్ణుంచి వచ్చింది. ఎద్దులగంటేమో అని అనుకుని దేవతలు దెయ్యాలు జ్ఞాపకం వచ్చి ఇక యిక్కడ ఉండకూడదని అనుకుంటూ ఆ గోడలన్నీ దాటి బయటపడ్డాం. ఇంటికి వెడదామని దారి పట్టాం. చటుక్కున మళ్ళీ వినిపించిదయ్యా ఆ గంట! ఈ పట్టు గుళ్లోంచే స్పష్టంగా మాకు వినుపించింది. ఒకళ్లమొఖాలు ఒకళ్లు చూసుకొన్నాం తప్ప కుండా ఇది ఏమిటో-అనే అనుకున్నాం.

గబ గబ దారిలోకి వచ్చి నిలిచాం. అయినా ఆ స్థలం వదల్లేక

అక్కడే నిల్చొని చెవియిచ్చి వినడం ఆరంభించాం. మాకు మంచి స్థాయిలో పాటలు వినిపించడం ప్రారంభించాయి. ఏమయితే అయింది, ఇంగ్లీషు చదువుకున్నాం, మానిషుంటువుల్లో పిశాచాలు లేవు; మనకి మాత్రం భయం ఎందుకురా! తెల్లవాడైతే భయపడ్తాడా? పదంటే పదనుకొని ఇటూ అటూ చూస్తూ నెమ్మదిగా ఆ పాడుగుళ్ళో ప్రవేశించాం. గర్భగుడి ముందరికివెళ్లాం. అక్కడ మాకు నీడల పంపిస్తూ అఖండంలాంటి దీపం కనబడింది. యిది కొరివిదెయ్యం కాదుగదా అనిపించింది.

గర్భగుడి మొదటి గుమ్మం దాటేప్పటికి పూర్వం విగ్రహం వుండే పీఠాని కెదురుగుండా పూజచేస్తూ ఒక మనుష్య రూపం కనిపించింది. లోపలి గుమ్మం దాటి వెళ్ళాం.

అక్కడ మాకు కలిగిన ఆశ్చర్యం ఏమిటంటే: మా వూళ్లో ముష్టెత్తు కొనే ముసలితాతే అక్కడ పూజ చేస్తున్నాడు. స్పష్టంగా ఏమీ శబ్దశ్వర దోషాలు లేకుండా సంస్కృత మంత్రాలు మహా ప్రవాహంలో ఉచ్చ రిస్తున్నాడు. స్తంభాల్లా అలాగే నిలబడ్డాం ఇద్దరమూ. ఆ విగ్రహంలేని ఆ పీఠానికే పువ్వులతో పూజ చేశాడు. హారతి యిచ్చాడు, నైవేద్యం పెట్టాడు.

## 4

అందాకా అలాగే నిలబడ్డ మమ్మల్ని చూసి లేవగానే మా కా పువ్వులు ఇచ్చాడు. తలవంచుకొని ఆ ప్రసాదం శిరస్సుమీద ఉంచు కున్నాం.

నేను : ఎవరు నువ్వు ? ఇక్కడేనా ఏమిటి నువ్వు వుండడం ?

ముసలితాత మాట్లాడలేదు.

నా స్నేహితుడు : అయ్యా ఎన్నాళ్ళనుంచి పూజ చేస్తున్నారండి మీరు ?

ఆ ముసలిభక్తుడు బ్రాహ్మణుడని కనిపెట్టాడు మావాడు.

మా ఇద్దరికేసి ఒక పదినిముషాలు చూశాడు తాత.

ఆ చూపులో ఏమీ కోపంలేదు.

ఇద్దరం ఎందుకో ఆయనకి నమస్కారాలు చేసాం.

కూచోమని సైగచేసి మేం కూచున్న తరువాత అక్కడ పద్మాసనం వేసి కూచున్నాడు మా ముసలితాత.

"నా పూర్వీకులు ఈ దేవాలయానికి పూజార్లు. ఎన్ని శతాబ్దాలనుంచి మాకుటుంబం తరతరంగా ఈదేవుడికి నిత్యనైవేద్యాది పూజలు చేస్తోందో నాకు తెలవదు. చెడుకాలమున ఈ గుడి పాడైపోయింది. ఈ గుడిచుట్టూ ఒక పెద్ద పట్టణం వుండేది. ఆ సంగతి మీకు తెలుసుననుకుంటా. ఆపట్టణం, దానికి తోడుగా ఈ గుడి పాడైపోయిన తర్వాత మా పూర్వీకుల కుటుంబం ఈ సమీపాన్నే ఒక పూరిల్లు వేసుకొని దేవుడికి నైవేద్యాలు, పూజలు నిత్యంగా జరుపుతూఉండేవారు. చుట్టుపక్కల వూళ్ళవాళ్ళు ఏడాదికొకమాటు ఇక్కడ ఒక తిరునాళ్ళ వుత్సవం చేసేవారు. అల్లా నాలుగైదు తరాలు పోయేటప్పటికి నెమ్మదిగా ఆ తిరునాళ్లు మాయమయ్యాయి........మా పూర్వీకుల కుటుంబం ఇక్కణ్ణుంచిపోయి ఇక్కడికి పదిమైళ్ళలో వున్న... గ్రామం వెళ్ళారు. నువ్వెరుగుదువా వూరు. కాని వారు ప్రతి ఏకాదశికి వచ్చి ఇక్కడ పూజలు చేసేవారు. రానురాను మాముత్తాతగారి కాలం వచ్చేటప్పటికి ఆయన కుటుంబంతో ఏడాదికి ఒకసారి ఆ తిరునాళ్ళరోజులకి మాత్రం ఇక్కడకు వచ్చి మూడురోజులు పూజలుచేసి వెళ్ళిపోయేవాడు. అల్లాగే మా తాతగారు మా నాన్నగారు విధికృతంగా పూజలుచేసేవాళ్లు.

"నేను బియే చదువుతూండగా నా తండ్రిగారు పోయారు. చచ్చిపోయేటప్పుడు నన్ను పిలిచి ఏమో చెప్పాలని అనేక మాట్లనుకొని మళ్ళీ మానేస్తూ చివరకు ప్రాణం పోయేసమయంలో నన్ను దగ్గిరకు పిలిచి అస్పష్టంగా నాలుగు మాట్లాడి ప్రాణం వదిలాడు.

"నేను గుడిమాటే మరిచా. ఏభై ఐదేళ్ళదాకా గవర్నమెంటు ఉద్యోగాలుచేశా. చివరకు డిప్యూటికలెక్టరు పనిచేస్తూ పిన్షను పుచ్చుకొన్నా.

ఆ వుద్యోగాలు చేసే రోజుల్లో ఆ తిరునాళ్ళ రోజుల్లో వైద్యులు చెప్పు కోలేని రోగం వచ్చేది. పెన్షను పుచ్చుకొని మా వూరు వచ్చాను. పూజలు పునస్కారాలు ఎన్నిచేసినా, ఎన్ని తీర్ధయాత్రలు సలిపినా నాకు ఒక విధమైన మనో చాంచల్యము కలిగింది. మా చుట్టాలు మతిపోయిందను కున్నారు."

"ఇప్పటికి నాలుగేళ్ళ క్రితము మా కిక్కడవున్న దేవాలయం బాపతు వచ్చిన పొలము చూడడానికి ఈ వూరు వచ్చాను. ఆ సమయంలో ఈ గుడి చూశాను."

"గుళ్లో అడుగుపెట్టానో లేదో ఏదో రాయి తగిలి కళ్ళు తిరిగి పడి పోయాను. అప్పుడు—ఏమి చెప్పను! ఈగుడి అంతా కలకలలాడిపోయింది. అన్ని వెండ దీపస్థంభాలలో ఆవునేయి దీపాలు, గంటలు, ధూపాలు, బంగారు విగ్రహాలు కనబడ్డాయి. "వత్సా—ఎన్ని వత్సరాలు పూజలు లేక వుండనమ్మా?" అని స్పష్టముగా వినబడ్డాయి మాటలు!"

"అప్పటినుంచి నా ఆస్థి దాన ధర్మాదులు చేశాను. కొంత నాదూరపు చుట్టాలకు ఇచ్చాను. నాకుమారుడు చెన్నపట్టణంలో చదువుతున్నాడు. అతనికి కొంత ఆస్థి ఇచ్చాను. ఇక్కడకు వచ్చి ఈవిధంగా ఉంటున్నా!"

ఆ భక్తుడు మానివేశాడు. మేం బయటకు వచ్చాం. మా ఆత్మలు అద్భుతానందంతో నిండాయి! దేశమంతా వెన్నెల నిండింది.